క్లుప్తంగా

నన్నయలో దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ శిబిరం జరుగుతుందని, బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. దంత సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి యూనియన్ బ్యాంకు



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జోనల్ హెడ్ షాలిని

సీతానగరం: యూనియన్ బ్యాంకు కాటవరం శాఖను నూతన భవనంలోకి మార్పు చేశారు. ఇప్పటి వరకూ కార్యకలాపాలు జరుపుతున్న భవనం ఇరుకుగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నూతన భవనాన్ని ఆ బ్యాంక్ జోనల్ హెడ్ ఎఫ్ఎంజీవో షాలిని మెనోస్ ప్రారంభించారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాలిని మెనోస్ మాట్లాడుతూ బ్యాంక్ టర్నోవర్ రూ. 60 కోట్లు ఉందన్నారు. తమ బ్యాంక్ ద్వారా రైతులకు, పరిశ్రమలకు, మహిళలకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. బ్రాంచ్ మేనేజర్ బోనగిరి ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే వారంతో ముగియనున్న పారాయణ



గురుచరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో చేపట్టిన 11 గురువారాల గురుచరిత్ర పారాయణ వచ్చే గురువారంతో ముగియనుంది. ఈ వారంతో పది వారాలు పూర్తి చేసుకుంది. లోకకల్యాణం, ప్రజా సంక్షేమాన్ని కోరుతూ స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో ఈ పారాయణ కార్యక్రమాన్ని ప్రతి గురువారం నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున కాకడ హారతి ఇచ్చిన అనంతరం పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నం వరకు 53 అధ్యాయాలను భక్తులు పఠనం చేస్తున్నారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించే అన్నసమారాధనలో పాల్గొంటున్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

సీతానగరం: విద్యార్థులకు మరింత మెరుగైన విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు అన్నారు. ఆయన గురువారం రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో తనిఖీ నిర్వహించారు. అక్కడి స్కూల్ రికార్డులను పరిశీలించి, విద్యార్థుల ప్రగతి, ప్రతిభలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నాడు - నేడు, మధ్యాహ్న భోజనం పథకం బిల్లులేవీ పెండింగ్ లేవన్నారు. మండల పాఠశాలల్లోని ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి, అవసరమైన పాఠశాలలకు పంపించి అక్కడ విద్యను బోధించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట హెచ్ఎంలు శ్యామలదేవి, కోలా సత్యనారాయణ, కేవీ రమణరావు, ముత్యం శ్రీనివాస్, ఎస్.త్రినాథరావు, కె.లక్ష్మీకాంతం ఉన్నారు.

బాణసంచా స్వాధీనం

రంగంపేట: అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ మండల కేంద్రమైన రంగంపేటలో తనిఖీలు నిర్వహించగా గ్రామానికి చెందిన గళ్లా సత్య శ్రీనివాసరావు ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను గుర్తించామన్నారు. దాన్ని స్వాధీనం చేసుకుని, సత్య శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అనుమతులు పొందకుండా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొత్త పింఛన్లు కలేనా..

- ఎదురుచూస్తున్న అర్హులు
- దరఖాస్తులతో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఓపెన్ కాని సర్వర్



ఊలపల్లిలోని సచివాలయం, పంచాయతీ కార్యాలయం

బిక్కవోలు: కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్ల మంజూరు కలగా మిగిలే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు వంద రోజులు పూర్తయినా ఇంత వరకూ కొత్త పింఛన్లపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్తగా అర్హత వచ్చిన వారందరూ దరఖాస్తులు పట్టుకుని రోజూ సచివాలయాల చుట్టు తిరగడం, వెబ్ సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది సమాధానం ఇవ్వడం, వారందరూ నిరాశతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. తాము అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆ తర్వాత ఊసే ఎత్తడం లేదు.

ఎదురుచూపులు

కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయా అని గ్రామాల్లో అర్హత కలిగిన వారందరూ ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హుల నుంచి దరఖాస్తులను వలంటీర్లు తీసుకునేవారు. పింఛన్ మంజూరయ్యే వరకూ అన్ని విధాలా సహకారం అందించేవారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు అర్హులు దరఖాస్తు చేసుకున్న వెంటనే పింఛన్ మంజూరయ్యేది. పింఛన్ల సొమ్మును కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వచ్చి అందించేవారు. కూటమి ప్రభుత్వంలో వలంటీర్లు లేరు. సచివాలయ ఉద్యోగులు నెలకు ఒక్కసారి పింఛన్లు ఇచ్చి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రజలకు ఏ అవసరం వచ్చినా సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఓపెన్ కాని వెబ్‌సైట్

కొత్తగా పింఛన్ల నమోదుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సచివాలయాలలో సిబ్బంది చెబుతున్నారు. దీంతో అర్హులందరూ నిరాశతో వెనుదిరుగుతున్నారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు చాలా మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లకు ఇప్పటికే అర్హత సాధించారు. వీరందరూ దరఖాస్తులను చేతపట్టుకుని సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న పింఛన్లలో అనర్హత పేరులో చాలా మందిని తొలగించి వాటి స్థానంలో కొత్తగా ఇచ్చేందుకు ప్రభుత్వం సమాయాత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పింఛన్లు, , కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలో 40,674 మందికి వివిధ రకాల సామాజిక పింఛన్లు అందజేస్తున్నారు. వారిలో అనపర్తి మండలంలో 10,438, బిక్కవోలులో 10,809, పెదపూడిలో 10,528, రంగంపేటలో 8,899 మంది ఉన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 500 వందల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా చేసుకోవాల్సిన వారు చాలా మంది ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ 18న ఆగిన వెబ్ సైట్ కొత్తగా ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన ఇంకా ఓపెన్ కాలేదు.

నిరంతరం జరగాలి



పింఛన్లు, రేషన్ కార్డులకు దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా ఇంతవరకూ సైట్ ఓపెన్ చేయకపోవడం దారుణం. దీనివల్ల చాలామంది అర్హులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరుకు నిరంతరం జరిగేది.

– బొడ్డు ముత్యాలరావు, పందలపాక

ఆదేశాలు రాలేదు



కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మాకు ఎటువంటి సమాచారం రాలేదు. బహుశా వచ్చే నెలలో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే నిబంధనల మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

– జేప ఝాన్సీ, ఎంపీడీవో, బిక్కవోలు

క్రీడా పోటీలలో విద్యార్థుల ప్రతిభ

బిక్కవోలు: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటర్ పోటీలకు కాపవరం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం పి.గోపాలకృష్ణారావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల చెందిన బసవ మల్లేశ్వరి, డొకుబుర్ర సౌజన్య ఈ నెల 24న మండపేటలో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్‌లో సెలెక్షన్లలో ప్రతిభ చూపారన్నారు. వచ్చే నెల ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మన జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ చైతన్యను అభినందించారు. అలాగే గ్రామ సర్పంచ్ సత్యం శెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ మారెళ్ల భీష్ముడు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు రంగంపేట విద్యార్థులు

రంగంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరిట జరుగుతున్న క్రీడా పోటీల్లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వి.పార్థసారథి తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాల ప్రకారం..

అండర్ – 14 బాలికల విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో డి.ప్రశాంతి ప్రథమ, జి.యామిని ద్వితీయ స్థానాలు సాధించారు. డిస్కస్‌త్రోలో డి.నాగలక్ష్మి (ప్రథమ), ఖోఖోలో డి.ప్రశాంతి, జి.యామిని, జి.ఉషశ్రీ, ఎస్.జాహ్నవి, డి. కీర్తనలు జిల్లాకు ఎంపికయ్యారు. కబడ్డీలో జి.నాగలక్ష్మి, వాలీబాల్‌లో వై.హర్షిత, యోగాలో డి.పూజిత, ఎం.సాహితి జిల్లా పోటీలకు అర్హత సాధించారు.

- అండర్–14 బాలుర విభాగంలో జి.ఆదినారాయణ 600 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. డి.దుర్గాప్రసాద్ డిస్కస్‌త్రోలో ప్రథమ, షార్ట్‌పుట్‌లో ద్వితీయ స్థానాలు, కబడ్డీలో డి.ఆదినారాయణ, జి.దుర్గాప్రసాద్ ప్రతిభ చూపారు.
- అండర్ – 17 బాలికల విభాగంలో కె.యవ్వనలక్ష్మి 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, కె.జాహ్నవి 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాలలో నిలిచి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. పి.హర్షిత జావెన్ త్రో, షార్ట్‌పుట్‌లలో ప్రథమ, కె.లక్ష్మీశ్రావ్య జావెలెత్రోలో ద్వితీయ, ఐ.దీపిక 400 మీటర్లు, 800 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానాలలో నిలిచారు.
- అండర్ – 17 బాలుర విభాగంలో పి.సన్నీ వరప్రసాద్ ట్రిపుల్ జంప్‌లో ప్రథమ, చెస్‌లో జీవీఎస్ మణికంఠ, కబడ్డీలో పి.సన్నీ వరప్రసాద్, ఎస్.శ్రీనివాస్ జిల్లా పోటీలకు అర్హత సాధించారు.



రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కాపవరం హైస్కూల్ విద్యార్థినులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రంగంపేట హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

బురదమయంగా రహదారి



జాతీయ రహదారిపైకి చేరిన నీరు

మధురపూడి: కోరుకొండ నుంచి కాపవరం వచ్చే రహదారి బురదమయంగా మారుతోంది. వర్షం కురుస్తే మురుగునీరంతా రోడ్డుపైకి చేరడంతో వాహన చోదకులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేసినా కాపవరం, కోరుకొండ పంచాయతీ అధికారులు స్పందించడం లేదు. అక్కడి స్థానికులు తమ నివాసాల నుంచి వచ్చే నీటిని రోడ్డు మీదకు వదిలివేస్తున్నారు. పేరుకే 216 ఈ జాతీయ రహదారి కానీ, మురుగునీటితో అధ్వానంగా మారింది. ఈ రహదారి మీదుగా భద్రాచలం, జగదల్‌పూర్, కుంట, విజయనగరం, సీలేరు, మోతుగూడెం, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలకు వాహనాల రాకపోకలు జరుగుతాయి.

జాబ్ మేళా.. జరిగిందంట..

- రాజానగరంలో నిర్వహణ
- సమాచారం ఇవ్వని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు
- ఆ ప్రాంగణంలోని అధికారులకూ తెలియని వైనం



జాబ్ మేళాలో మాట్లాడుతున్న నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్‌లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించామని ఆ సంస్థ అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ మేళాలో మూడు కంపెనీలు పాల్గొని, హాజరైన 64 మంది అభ్యర్థుల నుంచి 23 మందిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. సాధారణంగా జాబ్ మేళాలు నిర్వహించే ఒకటి, రెండు రోజుల ముందుగానే విస్తతంగా ప్రచారం ఇస్తారు. కానీ ఈ జాబ్ మేళా గురించి అదే ప్రాంగణంలో ఉన్న ఎంపీపీకిగానీ, ఎంపీడీఓకు, ఇతర శాఖాధికారులెవ్వరికీ తెలియకపోవడం విశేషం. ప్రాంగణంలో ఉన్న వారికే సమాచారం లేదంటే ఇక బయట ఉన్న నిరుద్యోగ యువతకు ముందుగా తెలిసే అవకాశమే లేదు.

భ్రమ కల్పించడానికేనా..

జాబ్‌మేళాలు నిర్వహించి, ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించామనే భ్రమను కలిగించే రీతిలో జాబ్ మేళా కార్యక్రమాలు ఉంటున్నాయని ఎంపీపీ మండారపు సీతారత్నం విమర్శించారు. గురువారం మధ్యాహ్నం వరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లోనే ఉన్నానని, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టుగా కనీస సమాచారం కూడా లేదన్నారు. కాగితాలలో లెక్కలు చూపించి, ప్రభుత్వాన్ని మాయచేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టుగా భావించాల్సి ఉందన్నారు. నిజంగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశమే ఉంటే ఈ జాబ్ మేళా గురించి ముందుగా ప్రకటన విడుదల చేసేవారన్నారు. కనీసం మీడియాకు కూడా ఈ విషయాన్ని ముందుగా తెలియనివ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నిర్వహించిన జాబ్ మేళా ఓపెన్ ప్లేస్‌లో కాకుండా కామన్ ప్రొడక్షన్ భవనంలోని ఒక గదిలో నిర్వహించినట్టుగా వారు విడుదల చేసిన ప్రకటనలోని ఫొటోలను బట్టి తెలుస్తుందన్నారు. ఇంత రహస్యంగా ఎందుకు చేయాల్సి వచ్చిందో ఆ శాఖ అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఇదే విషయమై ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా జాబ్ మేళా విషయం తనకు కూడా తెలియదన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి

సీతానగరం: మహాకవి చిలకమర్తి లక్ష్మీనరసింహం రచించిన గయోపాఖ్యానం నాటకం ఇప్పటికి లక్ష ప్రతులు అమ్ముడుపోయి రికార్డు సాధించడమనేది తెలుగు సాహిత్యానికి లభించిన పురస్కారమని సీతానగరం డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నాగేశ్వరరావు అన్నారు. ఆ కళాశాలలో గురువారం చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ సంఘ సంస్కర్త అయిన చికలమర్తి.. గాంధీజీ కంటే ముందే హరిజన పాఠశాలను ప్రారంభించారన్నారు. తన జీవిత చరిత్ర ద్వారా దేశ స్వాతంత్ర్య సంగ్రామంలోని ఎన్నో ఘట్టాలను అక్షరబద్ధం చేశారని కొనియాడారు. చరిత్ర అధ్యాపకుడు వై.ఫణీంద్ర మాట్లాడుతూ చిలకమర్తి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాధవ్, షేక్ దర్గా మదీనా, సుబ్బారావు, ఆలేఖ్య, వాణి, మీనాక్షి, రాజేశ్వరి, వెంకటేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అందరికీ అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

ధవళేశ్వరం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు అన్నారు. ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కల్యాణ మండపంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రీ అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశలలో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం, ఆంధ్రప్రదేశ్ విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు నల్సా పరిహార పథకం తదితర అంశాలను వివరించారు. నిందితులను కస్టడీలోకి తీసుకునే ముందు, దానికి గల కారణాలను కచ్చితంగా నిందితుడికి, అతడి కుటుంబ సభ్యులకు తెలియపర్చాలన్నారు. అరెస్ట్ అయిన వ్యక్తికి విచారణ సమయంలో తనకు నచ్చిన న్యాయవాదిని కలిసే హక్కు ఉంటుందన్నారు. న్యాయవాది లేని సమయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను, ఉచిత న్యాయవాదిని పొందే హక్కు వారికి ఉందన్నారు. నోటీసు, అరెస్టు, చార్జ్ షీట్, విచారణ, రిమాండ్ తదితర ప్రతి దశలోనూ నిందితుడి హక్కులకు భంగం కలుగకుండా పోలీసు అధికారులు తమ విధులు నిర్వహించాలన్నారు. పోక్సో చట్టంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాడేరు అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జగదీష్, రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎస్.భవ్య కిశోర్, రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేష్, ధవళేశ్వరం సీఐ టి.గణేష్ పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

రంగంపేట: మండల పరిధిలోని పెద రాయవరం గ్రామంలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాకు అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

నేటి నుంచి విద్యుత్ అంతరాయం

పెదపూడి: బొమ్మూరు నుంచి కొండగుంటూరు, మండపేట మండలం ఏడిద గ్రామాల మీదుగా వెళుతున్న 132 కేవీ లైన్లు సామర్థ్యం పెంచే పనుల నేపథ్యంలో శుక్రవారం నుంచి అక్టోబర్ 23 వరకూ విద్యుత్ అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. పనుల నేపథ్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అంతరాయం కలుగుతుందన్నారు. అనపర్తి మండలంలోని కుతుకులూరు, పరిసర గ్రామాలు, అనపోతావరం, సంపత్ నగర్, కొండగుంటూరులో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మిర్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆ సమయంలో మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక, బొబ్బిల్లంక, కూనవరం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

అభివృద్ధి దిశగా పయనం

మధురపూడి: సంక్షేమం, అభివృద్ధి దిశగా పయనం సాగుతోందని కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ అన్నారు. ఆయన గురువారం కోరుకొండ మండలం గాడాలలో జరిగిన ×ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెక్రటరీ బి. సత్యానందకుమార్, హైస్కూల్ హెచ్ఎం నిర్మలాజ్యోతి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పైన గ్రామంలో..

పెదపూడి: పైన గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి ఎన్డీఏ ప్రభుత్వ వంద రోజుల అభివృద్ధి, సంక్షేమ పై వివరించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 గోడపత్రిను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిర్రా వరప్రసాద్, సచివాలయం కార్యదర్శి సుంకర వీరస్వామి నాయుడు పాల్గొన్నారు.

తల్లీకుమార్తెలపై దాడి

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిని బలవంతంగా ఖాళీ చేయించడంతో పాటు తనను, కుమార్తెలపై దాడి చేసి గాయపరిచారని ఓ మహిళ బుధవారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. శాటిలైట్‌సిటీ బి బ్లాక్‌కు చెందిన గాలిదేవర లక్ష్మి తన కుమార్తెలు దూలం రమణ, ఆకుల నాగలక్ష్మీతో కలిసి ధర్నాల రాధకు చెందిన ఇంటిలో అద్దెకు ఉంటుంది. ఆ ఇంటిని విక్రయి స్తామని రాధ చెప్పడంతో రూ.10.20 లక్షలకు బేరం కుదుర్చుకుంది. ఆరు నెలల క్రితం రూ.2.20 లక్షలను అడ్వాన్స్‌గా చెల్లించింది. అయితే రాధ ఇంటిని వేరొకరికి అమ్ముతామని, ఇల్లు ఖాళీ చేయాలని లక్ష్మిని కోరింది. తమకు రెండు నెలలు సమయం కావాలని లక్ష్మి అడిగింది. అయితే ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో ధర్నాల రాధ, మురళి, బలగాల గోపి, బలగాల సావిత్రమ్మ ఆ ఇంటిలోకి ప్రవేశించి సామాన్లు పడేశారు. లక్ష్మి, ఇద్దరు కుమార్తెలపై దాడి చేశారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మోటారు సైకిళ్ల స్వాధీనం

కంబాలచెరువు: పలు ప్రాంతాల్లో మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న ఇద్దరిని ఒకటో పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రాజమహేంద్రవరంతో పాటు రాజానగరం, దేవరపల్లి, గూడూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల మోటారు సైకిళ్ల దొంగతనం జరిగినట్టు ఫిర్యాదులు అందాయి. కాగా.. పోలీసులు నగరంలోని పీవీ నరసింహారావు పార్కు వద్ద పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఆదెమ్మదిబ్బకు చెందిన దమ్ము దుర్గారావు, కృష్ణానగర్‌కు చెందిన గిడితూరి ప్రవీణసాయి మోటారు సైకిల్‌పై అటుగా వస్తున్నారు. వారిని ఆపి ప్రశ్నించగా అనుమానాస్పదంగా సమాధానాలు చెప్పారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి 8 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.